# మన బడి

## మాస పత్రిక

సంపుటి: 1 సంచిక: 8 జులై – 2025 పేజీలు: 24









## బడితో బంధం

### మెగా పీటీఎం 2.0

### గిన్నిస్ వరల్డ్ రికార్డ్

# వివిధ రకాల కిట్లను పరిశీలించిన మంత్రి లోకేష్

వచ్చే విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని 222 పీఎంశ్రీ పాఠశాలలకు అందించనున్న స్టెమ్ ల్యాబ్ కిట్లను విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ పరిశీలించారు.. ఒక్కో స్టెమ్ ల్యాబ్ కిట్ లో 335 ఐటెమ్స్ ఉంటాయి. రీసెర్చ్, కాన్సెప్ట్ ఓరియెంటెడ్ గా వీటిని రూపొందించారు. విద్యార్థులకు సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం అంశాలలో ప్రాక్టికల్ నాలెడ్జ్, నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఇవి దోహదపడనున్నాయి. వీటితో పాటు ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, సెకెండరీ స్కూల్స్ కు అందించే లైబ్రరీ బుక్స్, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి రూపొందించిన జాదుయీ పిటారా కిట్, ఎఫ్ఎల్ఎన్ ప్రింట్ రిచ్ మెటీరియల్స్, గ్రేడ్ 1,2 విద్యార్థుల కోసం రూపొందించిన ఎఫ్ఎల్ఎన్ హ్యాండ్ మేడ్ మెటీరియల్ ను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా రామవరప్పాడు ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న ఎమ్.మస్తాన్ రావు, విజయవాడ పటమట ఎంపీయూపీ స్కూల్ లో రెండో తరగతి చదువుతున్న నిహారిక గీసిన డ్రాయింగ్స్ ను సిబ్బంది మంత్రి లోకేష్ కు బహూకరించారు.











**గౌరవ సలహాదారులు**

**కోన శశిధర్,** ఐ.ఎ.ఎస్.,
సెక్రటరీ, పాఠశాల విద్యాశాఖ

**విజయరామరాజు. వి,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ

**డా. కృతికా శుక్లా,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, ఇంటర్మీడియెట్ విద్య

**ఎడిటర్**

**బి. శ్రీనివాసరావు,** ఐ.ఎ.ఎస్.,
స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్షా

**సలహాసభ్యులు**

**వి. ఎస్. మస్తానయ్య**, డైరెక్టర్, SIEMAT
**ఎం. ఆర్. ప్రసన్నకుమార్,** ASPD -1
**డి. దేవానందరెడ్డి,** సెక్రటరీ, KGBV
**డి. మధుసూదనరావు,** డైరెక్టర్, AP Text Books Press
**కె. నాగేశ్వరరావు,** అడిషనల్ డైరెక్టర్, SAMO
**కె. రవీంద్రనాథ్ రెడ్డి,** ASPD -2
**వి. మనోహర్ నాయక్,** CMO
**కె. జీవనజ్యోతి,** సూపరింటెండెంట్, CMO

**వర్కింగ్ ఎడిటర్**

**చల్ల మధుసూదనరావు,** మీడియా కన్సల్టెంట్

**సబ్ ఎడిటర్**

**గణేశ్ బెహరా,** PRO

**ఎడిటోరియల్ కమిటీ**

**డా. ఎస్. వి. లక్ష్మణరావు,** టీఎస్‌జీ (సీఎంవో)
**పైడి. వెంకట రమణ,** సీనియర్ ప్రోగ్రామర్
**డా. కె. శారద,** శామో ఫ్యాకల్టీ
**డా. ఎ. సుహాసిని,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. వి. సతీష్ రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. ఎస్. ప్రసాద్ రావు,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**జి. మహేశ్వర రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. టి. ఇస్మాయిల్,** దీక్ష కో ఆర్డినేటర్
**డా. కె. పెంచలయ్య,** టీఎస్‌జీ (ఆర్టీఈ)
**డా. వై. నరసింహం,** టీఎస్‌జీ(ఐఈ)
**పి. వెంకటేశ్వరరావు,** టీఎస్‌జీ (ప్లానింగ్)
**పి. గీత,** టీఎస్‌జీ(ఓఎస్‌సీ)

**డిజైనింగ్**

గిరిధర్ అరసవల్లి

**చిత్రకారులు**

మల్లిక్


# మన బడి

## మాస పత్రిక


సంపుటి: 1 సంచిక: 8 జులై - 2025 పేజీలు: 24


## అక్షరాలయాల్లో ఆనంద పండుగ గిన్నిస్ వరల్డ్ రికార్డ్

అందరి సహకారంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు ( మెగా పీటీఎం 2.0) విజయవంతమై గిన్నిస్ బుక్ రికార్డ్ సాధించాయి. రాష్ట్రవ్యాప్తంగా వేలాది పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో పండుగ వాతావరణంలో పీటీఎంలు జరిగాయి. ఈసారి ప్రభుత్వ విద్యాలయాలతోపాటు ప్రైవేటు విద్యా సంస్థలలో కూడా పీటీఎం నిర్వహించగలిగాం. ఈ కార్యక్రమాల్లో తల్లిదండ్రులు, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీలు, దాతలు, పూర్వవిద్యార్థులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు. విద్యా పురోగతిపై హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందించాం. అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమానికి ఏక్ పేడ్ మా కే నామ్ స్ఫూర్తి. ఆకుపచ్చని కల సాకారం కోసం విద్యార్థులు ఉద్యమంలా ముందుకు రావడం చాలా సంతోషం. విద్యతోపాటు పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా మొక్కలు నాటిన విద్యార్థులకు గ్రీన్ పాస్ పోర్టులు అందజేశాం. తల్లిదండ్రులు పిల్లల్లో పిల్లల్లా కలిసిపోయి చక్కగా ఆటలాడారు. ఉపాధ్యాయులతో తమ పిల్లల చదువు గురించి మాట్లాడారు. వేలాది పాఠశాలల్లో లక్షలాది మంది ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య ఆత్మీయ వారధి వేసింది మెగా పీటీఎం 2.0. ఆనందాలు నిండుగా అక్షరాలయాల్లో పండుగ ఘనంగా నిర్వహించడంలో భాగమైన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు. ప్రభుత్వం, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గారు, విద్యాశాఖ, సమగ్రశిక్షా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు, దాతలు, పూర్వ విద్యార్థులు మొత్తం యంత్రాంగం కలిసి చేసిన కృషి ఫలితమే మెగా పీటీఎం గిన్నిస్ వరల్డ్ రికార్డ్.

- **బి శ్రీనివాసరావు,** IAS
ఎడిటర్ & రాష్ట్ర పథక సంచాలకులు
సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం




Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed at **M/s. Lakshmi Vignesh Printers,** Guntur
ఆన్ లైన్ మ్యాగజైన్ కోసం: https://schooledu.ap.gov.in/samagrashiksha/ మరియు cse.ap.gov.in



# ఎక్కడ చూసినా AI అసలేమిటిదంతా?

ఈ మధ్యకాలంలో బాగా వినిపిస్తున్న పేరు. A.I. అంటే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. మనకు కావలసిన సమాచారాన్ని ఖచ్చితంగా ఇస్తోంది. బొమ్మలను తయారుచేస్తోంది – అలాగే మనం కొన్ని కీవర్డ్స్ ఇస్తే మనకు కావలసిన పవర్ పాయింట్ ఇమేజెస్, వీడియోలు, వాయిస్ జనరేట్ అవుతున్నాయి. అదే 30 సెకండ్లలోపే. పాత ఫోటోలలో ఉన్నవారు AI వలన మాట్లాడుతున్నారు. నవ్వుతున్నారు. అటు ఇటు కదులుతున్నారు. అసలు ఏమిటి దంతా..

నిజానికి మనిషి కొత్త అంశాలను సృజించడం కోసం నిరంతరం పని చేస్తూ ఉంటాడు. ఆలోచిస్తూ ఉంటాడు. అలెన్ ట్యూరింగ్ అనే కంప్యూటర్ శాస్త్ర వేత్త మరియు గణితవేత్త యంత్రాలతో మాట్లాడించాలని ప్రయత్నించి ట్యూరింగ్ టెస్ట్ ను ఆవిష్కరించారు. అదేవిధంగా జాన్ మెక్ కార్తీ అనే కంప్యూటర్ మేధావి యంత్రాలు ఎందుకు ఆలోచించకూడదు అనే అంశంపై అనేక పరిశోధనలు చేసి కృత్రిమమేధ ఆవిష్కరణకు కృషిచేశారు. అందుకే ఆయనను కృత్రిమ మేధ పిత అంటారు. ఇలా ఎంతో మంది కంప్యూటర్ మేధావులు వివిధ యంత్రాలను రూపొందించి వాటిని ఆలోచింపచేశారు. అందులో డీప్ బ్లూ అనే ఏఐ యంత్రం గ్యారీ కాస్పరోవ్ ప్రపంచ చెస్ చాంపియన్ను ఓడించి సంచలనం సృష్టించింది.


ఇలా అప్పుడప్పుమా వార్తలలో నిలిచిన ఈ AI 2023 లో ఒక్కసారిగా వెలుగులోనికి వచ్చింది మాత్రం చాట్ జిపిటి ద్వారా! ఓపెన్ AI అనే సాఫ్ట్ వేర్ సంస్థ అమెరికాకు చెందిన శామ్‌ఆల్డమన్ అనే అమెరికా మేధావి కృషి వలన జనరేటివ్ AIగా పరిచయమైంది. అదే చాట్ జీపీటీ ఇందులో మనకు కావలసిన అంశాన్ని గూర్చి యంత్రాన్ని అడగడం ఆలస్యం దానికి సంబంధించిన సమాచారాన్ని సెకనులలో అందిస్తుంది. గూగుల్ సెర్చ్ కూడా ఇదే పని చేసినప్పటికీ అది అనువైన వెబ్ సైట్ లను మాత్రమే సజెస్ట్ చేస్తుంది. కానీ యిలా ఉపయుక్తంగా సమాచారాన్ని చిటికెలో చాట్ జీపీటీ అందిస్తుంది. DALL. E అనే టూల్ ద్వారా మనకు కావలసి చిత్రాన్ని క్రియేట్ చేయడాన్ని కూడా ఓపెన్ AI సాయం అందిస్తోంది. ఏ ఐని వివిధ సంస్థలు వివిధ పేర్లతో ప్రవేశపెట్టాయి.

**మైక్రోసాఫ్ట్–కోపైలట్**

**మెటా – మెటా ఏఐ**

**గూగుల్ – జెమిని**

**ఓపెన్ ఏఐ –చాట్ జిపిటి**



కేవలం సమాచారాన్ని అందివ్వడమే కాకుండా అనేక విధాలుగా, అనేక రంగాలలో AI సేవలను ప్రారంభించాయి. లక్షలాది ఈమెయిల్ లను విశ్లేషించి అందులో ఫేక్ మెయిల్ లను గుర్తించడం, ఒక ప్రోడక్ట్ కు వచ్చే రివ్యూలను విశ్లేషించడం, వాతావరణం, బుకింగ్స్, షాపింగ్, రక్షణ యిలా అన్నింటిలోనూ AI ప్రవేశించింది. ఫలితంగా వందమంది కష్టపడి చేసే పనిని ఒక్క AI టూల్ చేస్తోంది. కాబట్టి AI స్కిల్స్ లేని ఉద్యోగులు తమ జాబ్ లను వదులుకునే పరిస్థితి తలెత్తుతోంది. ఇక ఎడ్యుకేషన్లో లెర్నింగ్ కి, టీచింగ్ కి అవసరమైన అనేక టూల్స్ లెక్కకు మించి వస్తున్నాయి.

జనరేటివ్ AI ను పెద్ద కంపెనీలే తయారు చేయగలుగుతాయి. ఎందుకంటే అందుకు ఎక్కువ మొత్తంలో డేటా అవసరం. అలాంటి డేటాను విశ్లేషించడానికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, నిపుణులు కావాలి. అందువల్ల గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా, ఓపెన్ AI వంటి కంపెనీలు మాత్రమే ఈ పనిని చేయగలవు.



## ఏ ఐతో ఏమేమి చేస్తున్నారంటే..

1. ఇమేజ్ క్రియేషన్ – డేటా ద్వారా గాని, పాత ఫోటోనుంచి గాని కొత్త ఇమేజ్ లను క్రియేట్ చేయడం
2. వీడియో జెనరేషన్ – కొంత టెక్స్ట్ ఇవ్వడం ద్వారా వీడియో తయారీ, చిత్రాలను, వీడియోలను, కంటెంట్ ను అదే ఎంపిక చేసుకుంటుంది .
3. వాయిస్ జెనరేషన్ – ఆడియో ఫైల్స్ తయారీ

   పవర్ పాయింట్స్, వెబ్ సైట్, పోస్టర్స్, లోగో, డాక్యుమెంట్లు రెడీ చేసుకోవచ్చు

ఇలా ఎన్నో పనులకు చేస్తుంది కాబట్టి AIకి అంత క్రేజ్..

– **నీలకంఠ,** తిరుపతి, 88860 26275



స్ఫూర్తి

# సామాజిక మాధ్యమ విద్యా సుధ





సామాజిక మాధ్యమాల్ని వినోదం కోసం వాడుతున్నవారు కొన్ని కోట్ల మంది ఉన్నారు...కాని విద్య, వైద్య సేవా రంగాలపై సామాన్యులకు అవగాహన కల్పించడానికి వాడేవారు మాత్రం అతి తక్కువ మంది మాత్రమే ఉన్నారు.. పినగాడి మండల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ సోషల్ మీడియాలో ఆమె చేస్తున్న ప్రచారాలు, రీల్స్ చూస్తే వాహ్ అనాల్సిందే... ఆమె ఎవరో తెలుసుకుందామా..

ఈరోజు మన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ... యూట్యూబ్, ఫేస్ బుక్, ఇన్స్టాగ్రామ్, వాట్సాప్, ట్విట్టర్ (ఎక్స్), లింక్ డిన్, ఇలా అన్ని సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ లో విద్యకు సంబంధించి, ఆంధ్రప్రదేశ్ అమలుచేస్తున్న గ్యారంటీడ్ ఎఫ్ ఎల్ ఎన్ ఫథకం, విద్యార్థుల విద్యలో ప్రగతి, తరగతి గదిలోని పాఠాలు – తరగతి గది బయట ఆటలు, ఇలా అన్నింటి గురించి ఎటువంటి అతిశయోక్తి లేకుండా, ఏమీ ఆశించకుండా... తమ పాఠశాల ప్రగతి, విద్యార్థుల పురోగతి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా అమలు చేస్తున్న విద్యలోని పెను మార్పులను సగర్వంగా ప్రచారం చేస్తున్నారు.. అందులో "పల్టాసింగి అలివేలిమంగ" ఒకరు..

"మిస్ యునిక్"

## ఆమె పేరు " పల్టాసింగి అలివేలిమంగ "...
## అందరూ ఆమెను "సుధ" అని పిలుస్తుంటారు...

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత ఎంతగానో ఉంది... అవి ఎందులోనూ తీసిపోవు. పిల్లలకు కావలసిన అన్ని సౌకర్యాలు ఉన్నాయని ఇన్స్టాగ్రామ్ ద్వారా చెప్తున్నారు పల్టాసింగి అలివేలి మంగ... సోషల్ మీడియా ట్రెండ్స్, ఆల్గారిథం తెలియకపోయినా ఆంధ్రప్రదేశ్ లోని ప్రభుత్వ పాఠశాలల గొప్పతనాన్ని, పనితీరును చాటిచెప్పాలనుకున్నారు.. తనకి కావలసింది ఇన్స్టాగ్రామ్ లో రీచ్ కాదు. తన విద్యార్థుల విద్యలో రీచ్... తను పనిచేస్తున్న పినగాడి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతోనే రీల్స్ చేయడం మొదలుపెట్టారు, తెలుగు, ఇంగ్లీష్ , బేసిక్ మ్యాథమెటిక్స్ సబ్జెక్టుల్లో బేసిక్స్ ను విద్యార్థులతో కంఠస్థం పట్టకుండా.... ఈజీ టిప్స్ చెప్పడం, ఆటలు-పాటలు ఆధారంగా పాఠాలు నేర్పించి, అవి కేవలం తన పాఠశాలలో విధ్యార్థులు మాత్రమే కాకుండా, అవన్నీ ఇన్స్టాగ్రామ్ లో పెడితే లక్షలాదిమంది చూస్తారు, ఈజీగా పాఠాలు అభ్యసించడానికి వీలవుతుందని తన తమ్ముడు, స్నేహితులు చెప్పడంతో "మిస్ యునిక్" అనే పేరు మీద విద్యకు సంబంధించిన కంటెంట్ ను పోస్ట్ చేయడం మొదలుపెట్టారు. అనతికాలంలోనే ఊహించిన దానికంటే ఎక్కువ రీచ్ వచ్చింది..

## కోట్లల్లో వ్యూస్...లక్షల్లో ఫాలోవర్లు..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆచరిస్తున్న గ్యారెంటీడ్ ఎఫ్ఎల్ఎన్ పథకాన్ని ఆకళింపు చేసుకున్న సుధ... ఆటల ఆధారంగా విద్యార్థులకు

బొధిస్తున్నప్పుడు వీడియోలు తీసి ఇన్స్టాగ్రామ్ లో పోస్ట్ చేయడంతో కోట్లల్లో వ్యూస్...లక్షల్లో ఫాలోవర్లు పెరిగారు...

ఈ డిజిటల్ యుగంలో ఉపాధ్యాయులు కూడా అందుకు అనుగుణంగా ఉండాలని నమ్మే సుధా, తను పనిచేస్తున్న పినగాడి మండల ప్రాథమిక పాఠశాలలో అడ్మిషన్స్ పెరిగేలా చేయడానికి ప్రధానోపాధ్యాయులు అప్పారావుతో కలిసి ప్రచారం చేయడంతో పాటు, తన విద్యార్థులతో కలిసి వినూత్నమైన ప్రణాళిక తో ఇన్స్టాగ్రామ్ లో కంటెంట్ పోస్ట్ చేస్తున్నారు.. సామాజిక మాధ్యమాలంటే కేవలం వినోదానికి మాత్రమే కాదని పిల్లలకు ఉపయోగపడే ఎడ్యుకేషనల్ కంటెంట్ కూడా పోస్ట్ చేసి విద్యార్థులకు స్ఫూర్తినిచ్చి కోట్లల్లో వ్యూస్ తో పాటు ఇన్స్టాగ్రామ్ లో సరికొత్త ట్రెండును సృష్టించారు పల్టాసింగి అలివేలి మంగ అలియాస్ సుధ.

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు దగ్గర గిరిజన ప్రాంతం పెదబయలులో జన్మించింది పల్టాసింగి అలివేలి మంగ(సుధ).. తండ్రి నిత్యానందం కార్పెంటర్, తల్లి సూర్యకాంతమ్మ గృహిణి. తనకు ఇద్దరు తమ్ముళ్లు, పేదరికంతో సుధను చిన్నప్పుడే హాస్టల్లో చేర్పించారు. గిరిజన ప్రాంతం కావడంతో తను చదివిన స్కూల్లో టీచర్లు సరిగా వచ్చేవారు కారు. వచ్చినా, వాళ్లు ఏం మాట్లాడేవారో సుధకి అర్థమయ్యేది కాదు.కాని,జీవితంలో విజయం సాధించాలన్నా, బ్రతుకులు బాగుపడాలన్న చదువు తప్ప వేరే మార్గం లేదని తన తల్లి చెప్పిన ధైర్యంతో ముందుకు సాగింది.. తను పెద్దయ్యాక టీచర్ కావాలనే లక్ష్యాన్ని 2014లో సాధించింది సుధ.. 2016 లో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పెదబయలు మండలం లోతట్టు ప్రాంతంలో ఉన్న బాసల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా ప్రయాణం మొదలుపెట్టింది. పెదబయలు నుండి ఎనిమిది కిలోమీటర్లు దూరంలో ఉన్న బాసల గ్రామానికి ద్విచక్ర వాహనం వెళ్లడానికి కూడా దారి లేదు. అలాంటి గిరిజన ప్రాంతంలో ఏడేళ్లు విధులు నిర్వర్తించింది సుధ. కొండా కోనల్లో నడకదారినే స్కూలుకి వెళ్లేది. తనకి తోడుగా వాళ్ల అమ్మ సూర్యకాంతమ్మ లేదా నాన్న నిత్యానందం వెళ్లేవారు వాళ్లిద్దరికీ కుదరకపోతే తన ఇద్దరి తమ్ముళ్లలో ఎవరో ఒకరు తోడుగా వెళ్లేవారు..



బాసల ఎంపిపి స్కూళ్లో సుధ చేరినప్పుడు విద్యార్థులు 16 మంది ఉన్నారు. అక్కడనుండి 2023లో ట్రాన్స్ఫర్ అయ్యే నాటికి 34 మంది విద్యార్థులకు పెరిగారు.. 2023 లో బాసల నుండి పెందుర్తి మండలం, పినగాడి ప్రాథమిక పాఠశాలకి ట్రాన్స్ఫర్ అయ్యారు. ఇంగ్లీష్, మ్యాథ్స్ టీచర్ గా పనిచేస్తున్నారు. సోషల్ మీడియాలో ఎడ్యుకేషన్ కంటెంట్ పోస్ట్ చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

– **అమలాపురపు దుర్గాప్రసాద్,** జర్నలిస్ట్








# ఆ మాస్టారి ఇల్లు ఓ విజ్ఞాన కేంద్రం




ఆ మాస్టారు తరగతి గదిలో ఉంటే విద్యార్థులకు వినూత్నంగా పాఠాలు చెబుతారు. చివరికి తన ఇంటినీ పాఠాలు చెప్పే విజ్ఞాన కేంద్రంగా మార్చేశారు. తాత, తండ్రుల వారసత్వాన్ని అందిపుచ్చుకొని, సైన్స్ టీచర్ అయ్యారు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, బోగోలు మండలం, చెన్నాయిరానిపాళెం ఉన్నత పాఠశాల భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు ఎ.వి. సుధాకర్. శాస్త్ర విజ్ఞాన వికాసంతోనే జగతికి వెలుగు అని బలంగా నమ్మే మాస్టారు.. ప్రయోగాత్మక బోధనతోనే విద్యార్థులను భావిభారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలనే ధ్యేయంగా పనిచేస్తున్నారు. మాతృమూర్తి అత్తివరం వెంకమ్మ జ్ఞాపకార్థం 2021లో నెల్లూరు నగరంలో నూతనంగా నిర్మించిన సొంత ఇంటిపైన "Aపవీ కిడ్స్ సైన్స్ కార్నర్" పేరుతో విజ్ఞానకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 15 లక్షల రూపాయలతో 15 అంకణాల వైశాల్యంలో ఈ సైన్స్ కార్నర్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులు సైన్సుపై మక్కువ పెంచుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలి, అందుకోసం చురుకైన విద్యార్థులుంటే, వారికి ఆర్థిక సహాయం అందిస్తూ , సైన్స్‌కార్నర్‌కు ఆహ్వానించి విజ్ఞాన ఫలాలు అందిస్తున్నారు.



## సందర్శన సమయం :

ప్రతి ఆదివారం ఉదయం 9.00 గం॥ల నుండి 12.00 గం॥ల వరకు చిన్నారులందరికీ ఉచిత ప్రవేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అనుకూలతను బట్టి ఉచిత భోజన వసతి, రవాణా ఖర్చులు భరిస్తున్నారు.

## సందర్శించిన విద్యార్థులు :

2022 మార్చి నుండి 2025 మే నెల వరకు అన్ని యాజమాన్యాల పాఠశాలలకు చెందిన గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులు 1650 మంది సైన్స్ కార్నర్ ని సందర్శించారు.

సైన్స్ మ్యూజియంలో ఏమేం చూడొచ్చంటే...

1. అంతరిక్షాన్ని తలపించే గెలాక్సీని సైన్స్ మ్యూజియం సీలింగ్‌పై ఏర్పాటు
2. అత్యాధునిక టెలిస్కోప్, మైక్రోస్కోప్, ప్రొజెక్టర్స్, స్కానర్స్, ప్రింటర్స్
3. 6 నుంచి 10వ తరగతి వరకు సైన్స్ ప్రయోగాలు సులువుగా చేసేందుకు అత్యాధునిక మినీ సైన్స్ ల్యాబ్
4. సుమారు 2000 పుస్తకాలతో మినీ సైన్స్ లైబ్రరీ
5. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రచురించిన పాఠ్యపుస్తకాలు (అన్నితరగతులు, అన్నిసబ్జెక్టులకు సంబంధించినవి)
6. పూర్తిస్థాయి వసతులలో అక్వేరియం, హెర్బేరియం, టెర్రేరియం, వివేరియం,
7. చిన్నారుల కోసం జంతు ప్రదర్శనశాల నమూనా
8. సుమారు వంద సంవత్సరాల క్రితం నాటి పురాతన వస్తు సామగ్రి (సైన్స్ రిలేటెడ్)
9. పురాతన నాణెములు, స్టాంప్‌లు ,కరెన్సీ నోట్‌లు, రాళ్ళు మరియు వివిధ చెక్కలతో చేసిన నమూనాలు
10. పురాతన చెక్క పెన్నులు నుంచి నేటి అత్యాధునిక పార్కర్ పెన్నులు వరకు సుమారు 200 రకాలు
11. మినీ వెదర్ స్టేషన్ (రెయిన్ గేజ్, విండ్‌వేవ్, ఫార్టిన్ భారమితి, థర్మామీటర్), మొ॥
12. ఇల్యూజన్ సైన్స్ ఆర్టికల్స్ ,సైన్స్ పోస్టర్స్
13. సైన్స్ రిలేటెడ్ చిల్డ్రన్స్ టాయ్స్
14. జూంవషష్ట్రశీఎశ్శోశీతీ సవజఅషవం
15. మాథ్స్ ల్యాబ్, బయోలాజికల్ ల్యాబ్
16. వివిధ రకాల సైన్స్ మోడల్స్, స్పెసిమన్స్, స్లైడ్స్,
17. శాస్త్రవేత్తల జీవిత విశేషాలను తెలిపే భారతీయ, విదేశీ శాస్త్రవేత్తల ఫోటో ఫ్రేమ్స్



18. థర్మామీటర్, బి.పి. ఆపరేటర్, షుగర్ చెకింగ్ మిషన్, స్టెతస్కోప్, పల్స్ ఆక్సీమీటర్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్

19.లో కాస్ట్, నో కాస్ట్, వేస్ట్ మెటీరియల్‌తో చేసిన అబ్బురపరిచే వివిధ రకాల సైన్స్ మోడల్స్.

20. మినీ బొటానికల్ గార్డెన్



చిన్నారులలో విజ్ఞానశాస్త్ర అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న టీచర్ ఏ.వి.సుధాకర్‌ను ప్రముఖులు ప్రశంసించారు. చిన్ననాటి నుండి విజ్ఞానశాస్త్రంపై ఆసక్తి పెంచుకొని పాఠశాల విద్య నుంచి విశ్వవిద్యాలయ విద్యవరకు సైన్స్ సబ్జెక్టులో అత్యధిక మార్కులు ఏవీ సుధాకర్ సాధించారు. ఎం.ఎస్సీ, కెమిస్ట్రీ పూర్తి చేసిన 2003 డి.ఎస్సీలో ఎంపికై సైన్స్ ఉపాధ్యాయుడిగా ప్రస్థానం ప్రారంభించారు. ఉపాధ్యాయుడిగా, పుస్తక రచయితగా, కాలమిస్టుగా పనిచేశారు.వివిధ సంస్థలు, ప్రభుత్వ కార్యక్రమాలలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. పాఠశాలలో సులువుగా అర్థం చేసుకునే విధంగా తక్కువ ఖర్చుతో అందుబాటులో వుండే విధంగా రూపొందించిన మినీ కెమిస్ట్రీ కిట్, రోజువారీ కార్యక్రమాల నిర్వహణకు తయారుచేసిన విజ్ఞానశాస్త్ర పేటికలు జాతీయస్థాయిలో సుధాకర్‌కు అవార్డులు తెచ్చిపెట్టాయి




## విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

విద్యార్థులు సైన్సుపై మక్కువ పెంచుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలి, అందుకోసం నా వంతు కృషిచేస్తున్నా. సైన్సు పట్ల అభిరుచి , ఆసక్తి గల విద్యార్థులను గుర్తించి , వీలుంటే వారికి ఆర్థిక సహాయం చేసి, ప్రయోగాత్మక బోధన ద్వారా వారిని భావిభారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకోసం నేను ఏర్పాటు చేసిన ఈ సైన్స్ మ్యూజియం సేవలు భవిష్యత్తులో మరింతగా విద్యార్థులకు చేరువయ్యేందుకు కృషిచేస్తాను.

**- ఏ.వి.సుధాకర్**
*భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు*
*చెన్నారాయునిపాళెం, బోగోలు మండలం.*



## సైన్సు విషయాలు తెలిశాయి

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, పొదలకూరు పట్టణానికి చెందిన పఠాన్ హమీద్ అను నేను ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుచున్నాను. గత ఏడాది నెల్లూరు పట్టణములోని ఏ.వి.ఎం. కిడ్స్ సైన్సుకార్నర్‌ను సందర్శించగా సుధాకర్ సర్ మా చేత భౌతిక రసాయనిక శాస్త్ర ప్రయోగాలు చేయించారు. సైన్స్ మ్యూజియంలో ప్రవేశించగానే అంతరిక్షంలో ప్రవేశించిన విధముగా అనుభూతి కలిగింది. సైన్స్ టాయ్స్, ఇల్యూషన్ సైన్స్ విషయాలు ఆసక్తిగా తెలుసుకున్నాను.



**- పఠాన్ హమీద్,** *10వ తరగతి,*
*జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పొదలకూరు*

## వేసవి సెలవుల్లో వెళ్లాను

పి.హరిప్రియ అను నేను నెల్లూరు పట్టణములోని ప్రతిభా ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 9వ తరగతి చదువుచున్నాను. ఈ ఏడాది వేసవి సెలవులలో ఏ.వి.ఎం. కిడ్స్ సైన్స్‌కార్నర్‌ను సందర్శించి నాకు అత్యంత అభిరుచి కలిగిన సైన్స్ పుస్తకాలను మ్యూజియం నుంచి తీసుకొని చదివి అనేక విషయాలను తెలుసుకోగలిగాను. మ్యూజియంలో గల పురాతన వస్తు సామగ్రి, కాయిన్స్, హెర్బేరియం, ఎక్వేరియం, మినీ బొటానికల్ గార్డెన్, మిని వెదర్ స్టేషన్ నన్ను ఎంతగానో ఆకట్టుకున్నవి.



**- పి.హరిప్రియ,** *9వ తరగతి*
*ప్రతిభా ఇంగ్లీష్ మీడియం స్కూల్*






# ఆ బాలల విద్యాహక్కు unicef లెర్నింగ్ పాస్‌పోర్ట్



ప్రియమైన నేటి, రేపటి బాలల్లారా,

సంఘర్షణ, విపత్తులు సంభవించే ప్రదేశాల్లో నివసిస్తున్న మీలో... నలుగురిలో ఒకరు మాత్రమే బతకటానికి, నేర్చుకోవడానికి అవకాశం ఉన్నది.

## నేను ఎందుకు భయపడుతున్నాను?


యుద్ధం వస్తే... పిల్లలే అందులో మొదటగా బలిపశువులు అవుతారు. 1989-చైల్డ్ రైట్స్ కన్వెన్షన్ నాటి నుండి పరిశీలిస్తే... ఈ రోజున సంఘర్షణలకు లోనవుతున్న దేశాల సంఖ్య అత్యధికంగా ఉన్నది. హింసాత్మక సంఘటనలు లేదా విపత్తులు సంభవించే ప్రదేశాల్లో నివసిస్తున్న దేశాల్లో నలుగురు పిల్లల్లో ఒకరు... ఆ వైపరీత్యాలకు బలి అవుతున్నారు. యుద్ధాల వల్ల, అభద్రతాభావం వల్ల... ఇప్పటివరకు 28 మిలియన్ల మంది పిల్లలు... వారివారి ఇళ్లకు దూరమైనారు. భావి జీవితంలో వారికి కావలసిన విద్యార్జన, ఉపాధి మార్గాలకు అవసరమైన నైపుణ్యాలు నేర్చుకునే అవకాశాన్ని వారు కోల్పోతున్నారు. ఇప్పటికే 75 మిలియన్ల మంది బాలలు, యువతీ యువకులు... సంఘర్షణలు, వైపరీత్యాల మూలంగా వారివారి దేశాల సరిహద్దులు దాటి వలస వెళ్లడమో లేదా ఉన్న చోటి నుండి మరో చోటికి వెళ్లవలసి రావడమో జరిగింది. వారి ఆకాంక్షలకు వారు దూరం కావడమనేది... మొత్తానికి మొత్తంగా... మానవ వనరులను ఉపేక్షించడమే అవుతుంది. దీని పరిణామంగా... ఎవరికీ పట్టని పరిస్థితిలో, అయోమయ స్థితిలో ఉండి, ద్వేషపూరితమైన భావజాలంలో కొట్టుకుపోయే... విద్యలేని యువత తయారు కావడమనేది అన్నిటికన్నా ప్రమాదకరమైన విషయం.


## నేను ఎందుకు ఆశావహంగా ఉన్నాను?

శరణార్థులకు విద్యావకాశాలు కల్పించడానికి కొన్ని దేశాలు ఫలవంతమైన ప్రణాళికలు రూపొందించాయి. సిరియన్ అరబ్రిపబ్లిక్ లో జరిగిన యుద్ధం బారినుండి తప్పించుకున్న పిల్లలు లెబనాన్ వచ్చినప్పుడు... అప్పటికే సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న అక్కడి పబ్లిక్-స్కూలు వ్యవస్థ... వందల వేల మంది పిల్లలకు విద్యావకాశాలు కల్పించే సవాలును ఎదుర్కొన్నది. ఆ సవాలును ఒక అవకాశంగా స్వీకరించి... అంతర్జాతీయ భాగస్వాములతో కలిసి శరణార్థుల పిల్లలకు కూడా అదే స్కూళ్ళల్లో విద్యావకాశాలు కల్పిస్తూనే తమ విద్యా వ్యవస్థను కూడా ఆ దేశం బలోపేతం చేసింది.

డిజిటల్ ఆవిష్కరణలు మనకు మరింత సహాయాన్ని అందించగలవు. మైక్రోసాఫ్ట్, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంతో కలిసి... ప్రపంచ బాలలందరికీ విద్యావకాశాలు కల్పించడానికి... యూనిసెఫ్... "లెర్నింగ్ పాస్పోర్ట్" పేరుతో ఒక డిజిటల్ వేదికను ఏర్పాటు చేసింది. ప్రస్తుతానికి ఈ వేదిక ... శరణార్థులు, ఇతర దేశాలకు లేదా ఇతర ప్రాంతాలకు వలస వచ్చిన వారికోసం ప్రయోగాత్మకంగా నిర్వహించబడుతున్నది. యువత ఏ పరిస్థితుల్లో ఉన్నప్పటికీ... డిజిటల్ ప్రపంచం... విద్యను వారికి చేరువ చేస్తుంది. స్థల మార్పిడి చేసుకోవాల్సిన మిలియన్ల కొద్ది బాలలకు, యువతకు ఈ "లెర్నింగ్ పాస్పోర్ట్" లాంటి పరిష్కారాలు అభివృద్ధి చేయడం వల్ల... అవి వారి నైపుణ్యాలను పెంపొందించడానికి దోహదం చేస్తాయి.

**హేన్రియేట్ హెచ్ ఫోర్,**
*యునిసెఫ్ యునిసెఫ్ మాజీ ఈడీ*
అనువాదం: **చింతకుంట్ల సంపత్ రెడ్డి**





# మెగా పీటీఎం గిన్నిస్ వరల్డ్ రికార్డ్

## ఈ రికార్డు ఉపాధ్యాయులకే అంకితం

*** 53.4 లక్షల పేరెంట్స్, టీచర్స్ పాల్గొన్న అతిపెద్ద పీటీఎంగా రికార్డ్**

*** అంతా కలిపి 1.5 కోట్ల మంది హాజరు * గిన్నిస్ రికార్డ్ సాధనలో భాగమైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు**

*** విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రపంచంలోనే అతిపెద్ద పేరెంట్-టీచర్ మీటింగ్ (MEGA PTM) నిర్వహించి గిన్నిస్ ప్రపంచ రికార్డును నెలకొల్పిందని, ఈ గిన్నిస్ రికార్డు ఉపాధ్యాయులకు అంకితం అని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్స్ ప్రకారం మెగా పీటీఎంలో 5.34 మిలియన్ల (53.4 లక్షలు) తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం, పాఠశాల నిర్వహణ కమిటీ (SMC) సభ్యులు అంతా కలిపి 15.2 మిలియన్ల (1.5 కోట్లు) మంది అతిపెద్ద పేరెంట్-టీచర్ మీటింగులో భాగమయ్యారు.

జాతీయ విద్యా విధానం ఐదవ వార్షికోత్సవం జూలై 29కి ఒక రోజు ముందు మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ గిన్నిస్ రికార్డు సాధించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రపంచ స్థాయిప్రమాణాలను తీసుకురావడానికి ప్రభుత్వం చేస్తున్న కృషికి ఈ రికార్డు గొప్ప ప్రోత్సాహంగా నిలిచిందని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు MEGA PTMని విజయవంతం చేసేందుకు అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు. ఈ అరుదైన రికార్డు సాధనలో భాగమైన విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ విద్యా వికాసానికి, సమ్మిళిత విద్యను ప్రోత్సహించడానికి ప్రభుత్వం, విద్యాశాఖ చేస్తున్న కృషిని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గుర్తించడం హర్షనీయమన్నారు.









### రికార్డు నమోదు ఇలా...

MEGA PTM నుండి సేకరించిన డేటాను నిశితంగా ఆడిట్ చేసిన తర్వాత ఈ రికార్డు అధికారికంగా గిన్నిస్ రికార్డు బృందం ధ్రువీకరించింది. ఇందులో మూడు ఫోటోగ్రాఫ్‌లు, ఒక వీడియో, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల సంఖ్య మరియు ప్రతి పాల్గొన్న పాఠశాల నుండి ఇండిపెండెంట్ విట్నెస్ ద్వారా డేటాను LEAP యాప్ ద్వారా సేకరించారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ నియమించిన 40 మందికి పైగా ఆడిటర్లు ఈ అవార్డును నిర్ధారించడానికి 61000 పాఠశాలల నుండి సేకరించిన డేటాను విశ్లేషించారు. అధికారిక గిన్నిస్ ప్రపంచ రికార్డు ధృవపత్రం త్వరలో అమరావతిలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో అందజేస్తారు.

## ఈ అవార్డు ఎనలేని ప్రోత్సాహం

సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ **బి. శ్రీనివాసరావు**

విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ గారి ఆలోచనల మేరకు తీసుకొస్తున్న ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ లో భాగంగా అందరికీ నాణ్యమైన, సమానమైన విద్యను అందించేందుకు ఒక యజ్ఞంలా పనిచేస్తున్న ప్రభుత్వం, రాష్ట్ర విద్యా శాఖ, సమగ్రశిక్ష, ఉపాధ్యాయులకు మెగా పీటీఎం నిర్వహణ ద్వారా అందిన గిన్నిస్ అవార్డు ఎనలేని ప్రోత్సాహంగా నిలుస్తుందని సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. మెగా పీటీఎం ద్వారా వరల్డ్ రికార్డు సాధనకు చేసిన కృషిలో భాగమైన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



# బడితో బంధం

## మెగా పీటీఎం 2.0
## గిన్నిస్ వరల్డ్ రికార్డ్



**పండుగ వాతావరణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం**

**ముఖ్యమంత్రి చంద్రబాబు గారితో కలిసి పాల్గొన్న విద్యాశాఖా మంత్రి లోకేష్**

**చంద్రబాబు గారి పాదాలకు నమస్కరించిన లోకేష్**

**ఉపాధ్యాయుడిగా మారి పాఠాలు చెప్పిన చంద్రబాబు, విద్యార్థిగా మారి శ్రద్ధగా విన్న మంత్రి లోకేష్**

శ్రీ సత్యసాయి జిల్లా కొత్త చెరువు జడ్పీ పాఠశాలలో జరిగిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం మెగా పీటీఎం 2.0 కార్యక్రమం ఆద్యంతం పండుగ వాతావరణంలో కొనసాగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారితో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ముందుగా జూనియర్ కళాశాల ప్రాంగణానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారి పాదాలకు మంత్రి నారా లోకేష్ నమస్కరించారు. అనంతరం తన నలుగురు పిల్లలకు తల్లికి వందనం పథకం కింద సాయం పొందిన పి.మాధవి, ఆమె నలుగురు పిల్లలు ముఖ్యమంత్రి పాదాలకు నమస్కారం చేసి ఆశీర్వాదం పొందారు. తల్లుల గొప్పదనంతో పాటు తల్లికి వందనం పథకం గురించి తెలియజేసేలా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వాల్స్ ను ముఖ్యమంత్రితో కలిసి వీక్షించారు. ఫోటోలు దిగారు. ఎన్ సీసీ క్యాడెట్స్ గౌరవ వందనం మధ్య జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చేరుకున్నారు.




### చంద్రబాబు గారితో కలిసి విద్యార్థులతో ఇష్టాగోష్టి

కొత్త చెరువు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ పదో తరగతి విద్యార్థులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ముఖాముఖి మాట్లాడారు. విద్యార్థుల విద్యా ప్రగతి, అభిరుచి, ప్రవర్తన, ఆరోగ్యం హాజరు మొదలైన అంశాలతో కూడిన హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఒకే కుటుంబానికి చెందిన పదో తరగతి ఏ సెక్షన్ కు చెందిన పి.రిహాన్ బాష, పి.జిగ్ను ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించారు. వారి మార్కులను అడిగి తెలుసుకున్నారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. స్కూల్ కు గైర్హాజరైన విద్యార్థులకు



సంబంధించి తల్లిదండ్రులకు ఆగష్టు నుంచి మెసేజ్ రూపంలో తెలియజేయజేస్తామని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ తెలిపారు.

### ఉపాధ్యాయుడిగా మారి పాఠాలు చెప్పిన చంద్రబాబు, విద్యార్థిగా మారి శ్రద్ధగా విన్న మంత్రి లోకేష్

జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని 8వ తరగతి బి సెక్షన్ విద్యార్థులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు ఉపాధ్యాయుడుగా మారి 'వనరులు' అనే సబ్జెక్ట్ పై క్లాస్ చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థిగా మారిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్.. ముందు బెంచీలో కూర్చొని చంద్రబాబునాయుడు గారు చెప్పిన పాఠాన్ని శ్రద్ధగా విన్నారు. మానవ వనరులు అంటే ఏమిటి, సహజ వనరులు, పునరుత్పాదక వనరులు,



పునరుత్పాదకం కాని వనరులపై విద్యార్థులకు ముఖ్యమంత్రి పాఠం బోధించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు.

### విద్యా మంత్రిని ప్రశంసించిన ముఖ్యమంత్రి

భవిష్యత్‌లో విద్యార్థులు ఏం కావాలనుకుంటున్నారని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు అడిగి తెలుసుకున్నారు. పోలీస్, డాక్టర్, ఐఏఎస్, క్రికెట్ ప్లేయర్లు కావాలనుకునేవారు చేతులు పైకి ఎత్తాలని సూచించారు. వారంతా తమ లక్ష్యాన్ని చేతులు పైకి ఎత్తి చెప్పారు. విద్యార్థులకు ఆశయం ఉండాలని.. ఆశయ సాధన కోసం ఇప్పటినుంచే కష్టపడి చదవాలని మార్గదర్శకం చేశారు. అందరికీ గుడ్ లక్.. ఆల్ ది బెస్ట్ చెప్పారు. రాజకీయ నాయకులు కావాలనుకునేవారు చేతులు ఎత్తాలని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ అడగగా.. ఎవరూ చేయి పైకి ఎత్తలేదంటూ నవ్వులు పూయించారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ.. నారా లోకేష్ గారు బాగా చదువుకున్నారు, మంత్రి అయ్యారు, తల్లికి వందనం అమలు చేశారా, లేదా.. పాఠశాలల్లో మార్పులు తీసుకువచ్చారంటూ ఆయనను ప్రశంసించారు. అనంతరం విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు పరిశీలించారు. మార్కులపై ఆరా తీశారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఫోటోలు దిగారు.

## పాఠశాలల అభివృద్ధిలో పూర్వవిద్యార్థులు భాగస్వాములు కావాలి!

### కొత్తచెరువు మెగా పిటిఎం కార్యక్రమంలో విద్య, ఐటిశాఖల మంత్రి లోకేష్

ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్న వారంతా తాము చదువుకున్న పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములై విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు జిల్లాపరిషత్ హైస్కూలులో నిర్వహించిన మెగా పిటిఎం కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి విజయం వెనక ఒక టీచర్ ఉంటారు. బ్లాక్ బోర్డ్ మీద చాక్ పీస్ తో అక్షరాలు రాసి ఛాంపియన్స్ ని తయారు చేస్తారు. ఉపాధ్యాయులు తరగతి గదిలో చదువుతో పాటు జీవిత పాఠాలు నేర్పుతారు. స్టూడెంట్ ర్యాంక్ కొడితే టీచర్ కి ఆనందం, స్టూడెంట్ కి ఉద్యోగం వస్తే టీచర్ కి పండగ. అందుకే మనం ఎంత ఎత్తుకి ఎదిగిన మనకి పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను, మనం చదువుకున్న స్కూల్ ని జీవితాంతం మర్చిపోకూడదు.

### త్వరలోనే కొత్త టీచర్ల నియామకం

నేటి పోటీ ప్రపంచాన్ని తట్టుకుని నిలబడేలా కెజి నుంచి పిజివరకు పాఠ్యాంశాల్లో సమూల మార్పులు తెస్తున్నాం. గతంలో కేవలం 1200 మాత్రమే వన్ క్లాస్ – వన్ టీచర్ పాఠశాలలు ఉండగా, ఇప్పుడు తరగతికొక ఉపాధ్యాయుడు ఉండేలా 9,600 మోడల్ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటుచేశాం. బ్యాగ్ బరువు తగ్గించేందుకు సెమిస్టర్ వారీగా పుస్తకాలను రూపొందించాం. తల్లికి వందనం ద్వారా 67.27 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఎకౌంట్లలో ₹10 వేల కోట్లు జమచేశాం. సమగ్ర అభ్యాసం, విద్యా నైపుణ్యాలను పెంచడమే లక్ష్యంగా చేసుకుని మేము LEAP (లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) పేరుతో ఆంధ్ర మోడల్ స్కూల్ ఎడ్యుకేషన్‌ను ప్రవేశపెట్టాం. దేశంలోనే అతిపెద్ద నియామకాలలో ఒకటైన మెగా DSCని విజయవంతంగా నిర్వహించాం, ఆగస్టు నెలాఖరులోగా 16,347మందికి నియామక ఉత్తర్వులు అందజేయబోతున్నాం.





## పేదరికాన్ని రూపుమాపే ఆయుధం విద్య

పేదరికం నుండి బయటకు తెచ్చే ఒకే ఒక్క ఆయుధం విద్య అని మేము బలంగా నమ్ముతున్నాం. జ్ఞానం అంతిమ లక్ష్యం స్వేచ్ఛ... సంస్కృతి అంతిమ లక్ష్యం పరిపూర్ణత... జ్ఞానం అంతిమ లక్ష్యం ప్రేమ... విద్య అంతిమ లక్ష్యం శీలం...ఇది చెప్పింది భగవాన్ శ్రీ సత్యసాయి బాబా గారు. గురుపౌర్ణమి రోజు భగవాన్ శ్రీ సత్యసాయి జిల్లాలో జరుగుతున్న ఈ మెగా PTM కార్యక్రమంలో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నా జీవితంలో మరిచిపోలేని రోజు ఇది. ఏపీ విద్యారంగ చరిత్రలోనే సరికొత్త రికార్డు మన మెగా పిటిఎం 2.0. నేను చదువుకునే రోజుల్లో మా స్కూలులో పేరెంట్ టీచర్ మీటింగ్ జరిగేది. కానీ మా నాన్న బిజీగా ఉండటం వల్ల ఎప్పుడు హాజరయ్యేవారు కాదు. ఎప్పుడూ మా అమ్మే వచ్చేవారు. ఇప్పుడు దేవాంశ్ చదువుతున్న స్కూల్లో పేరెంట్ టీచర్ మీటింగ్ జరిగితే వెళ్లడానికి నాకు కుదరడం లేదు, బ్రాహ్మణి వెళుతుంది. కానీ ఈ రోజు మా నాన్న గారు, నేను ఇద్దరం లక్షల మంది పిల్లలు హాజరైన మెగా పిటిఎం 2.0కి వచ్చాం, చాలా సంతోషంగా ఉంది.





## నాణ్యమైన విద్య అందిస్తున్నాం

మాతృ దేవో భవ... అమ్మ అంటే రెండు అక్షరాలు కాదు... కనిపించే దేవత. అమ్మ అంటే ధైర్యం. మనకి నడక నేర్పేది అమ్మ, మనకి బాధ్యత నేర్పేది అమ్మ. మన భవిష్యత్తు కోసం జీవితాన్ని త్యాగం చేసింది అమ్మ. ఇక్కడ ఉన్న తల్లులు అందరికి వందనం. అందుకే ముఖ్యమంత్రి గారు కేవలం డబ్బులు ఇవ్వడం కాదు, గౌరవం నిలపాలని చెప్పారు. అమ్మను గుండెల్లో పెట్టుకొని కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనే ఉంది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వవిద్యను తయారుచేయాలని చెప్పారు. అందుకే పుస్తకాలు, యూనిఫాంలు, షూలు నాణ్యమైనవి ఇచ్చాం. మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేరిస్తే ఎటువంటి ఆర్థిక భారం ఉండదు. ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, షూ, బెల్ట్, నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. ప్రభుత్వ





పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉంటారు, నాణ్యమైన విద్య అందిస్తున్నాం. చిన్నారులను బాయిలర్ కోళ్లలా కాకుండా వారి సర్వతో ముఖాభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలల్లో ఆటలు, పాటలు, యోగా అన్నీ నేర్పిస్తున్నాం. పది, ఇంటర్ ఫలితాల్లో మనవాళ్లు అద్భుతమైన ప్రతిభ చాటారు, వారికి షైనింగ్ స్టార్స్ పేరిట అవార్డులు కూడా ఇచ్చాం.

### రాజకీయాలకు అతీతంగా విద్య!

ప్రభుత్వ పాఠశాలల్లో రాజకీయాలు ఉండకూడదు. రాజకీయాలు గేటు బయటే, పాఠశాలలో అడుగు పెట్టడానికి లేదు. విద్యావ్యవస్థలో రాజకీయాలు వద్దు... ఫలితాలపై మాత్రమే దృష్టి పెట్టాలన్నది మా విధానం. గతంలో మాదిరి పార్టీ రంగులు, మా ఫోటోలు విద్యార్థులకు ఇచ్చిన పుస్తకాలు, వస్తువులపై ఎక్కడా కనిపించవు. స్కూల్స్ లో విద్యకు సంబంధించిన కార్యక్రమలు తప్ప ఏ ఇతర కార్యక్రమాలు చేయడానికి వీల్లేదని ఆదేశాలు ఇచ్చాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో ఒకే రోజు మెగా పిటిఎం నిర్వహించడం ఒక రికార్డు. ఉపాధ్యాయులు, తల్లి-దండ్రులు, విద్యార్థులను అనుసంధానం చేయడమే ఈ మెగా పిటిఎం లక్ష్యం. మెరుగైన విద్య అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. మన పిల్లల్లో అద్భుతమైన శక్తి ఉంది, దారి చూపిస్తే ప్రపంచాన్ని శాసిస్తారు, పిల్లలను ప్రయోజకులుగా మార్చే బాధ్యత తీసుకుంటా.







### తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాలి

ఉపాధ్యాయులు ఎంత చెప్పినా, పిల్లలు ఇంటికి వెళ్లిన తర్వాత తల్లి-దండ్రులు కూడా బాధ్యత తీసుకోవాలి. పిల్లలకి ఈ రోజు స్కూల్లో ఏం పాఠాలు చెప్పారు, హోంవర్క్ చేసారా,లేదా అనేది గమనించాలి. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిని తెలియజేసే హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తున్నాం. ఈ కార్యక్రమములో తల్లిదండ్రుల నుండి అభిప్రాయాన్ని తీసుకుంటాం. గౌరవ ప్రధాని నరేంద్ర మోదీజీ ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని) పిలుపునిచ్చారు, నాకు అన్న సమానమైన పవన్ అన్న కోటిమొక్కలు నాటాలని సవాల్ విసిరారు. ఆయన సవాలు నేను స్వీకరిస్తున్నా. ఒక విద్యాశాఖ ద్వారానే కోటిమొక్కలు నాటే బాధ్యత స్వీకరిస్తాం. గ్రీన్ పాస్ పోర్టులో
















మూడేళ్లపాటు మొక్క పరిరక్షణ వివరాలు పొందుపరుస్తాం. బాధ్యత పెంచేందుకే పిల్లలకు గ్రీన్ పాస్ పోర్టులు ఇస్తున్నాం. ఈ కార్యక్రమం లో భాగంగా సుమారు 45 లక్షల మంది విద్యార్థులతో మొక్కలు నాటిస్తున్నాం.

## లక్ష్యంగా సాధించాలి..

“జీవితంలో ఎల్లప్పుడూ కష్టతరమైన మార్గాన్నే ఎంచుకోండి. చిన్నచిన్న విషయాలకే విద్యార్థులు కుంగిపోకూడదు. ఎన్ని కష్టాలు ఎదురైనా జీవితంలో లక్ష్యసాధనకు ముందుకు సాగాలి. ఒక సబ్జెక్టులో ఫెయిలయ్యారని పిల్లలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఆ ఫెయిల్యూర్ మనలో కసి, పట్టుదల పెంచాలి కానీ, అధైర్యపడకూడదు.” అని మంత్రి లోకేష్ విద్యార్థులకు ఉద్బోధించారు.





# అమ్మ గెలిచింది

(జరిగినకథ – విద్యార్థుల హృదయాలకు అంకితం)
దళాయిపేట గ్రామంలో జరిగిన కథ

పచ్చని పొలాల మధ్య నల్లటి ఒక మట్టి గుడిసె. అందులోనే నివసించే వాడు వెంకటి, పదో తరగతి విద్యార్థి. వయసుకు మించిన లోతైన చూపు, మాటలు తక్కువ, కలలు ఎక్కువ. ఈకథలో అతనికన్నా గొప్ప పాత్ర ఉంది – అతడి తల్లి అప్పయ్యమ్మ.

అక్కడ ప్రతి ఒక్క గుడిసె చీకట్లో నిద్రపోతుంటే, ఒక గుడిసె మాత్రం ఉదయం నాలుగు గంటలకు మేల్కొంటుంది. ఆ గుడిసెలో ఇద్దరు జీవితం కోసం పోరాడుతారు – తల్లి అప్పయ్యమ్మ, కొడుకు వెంకటి.

ఆమె ప్రతి ఉదయం నాలుగు గంటలకే ఊళ్ళో వీధుల్లో అందరిని నిద్రలేపే అలారంలా "కూరగాయలమ్మా.. కూరగాయలు" అనే కేకతో నిద్రలేపుతుంది. తలపై భూగోళం అంతతట్ట, అందులో తాజా కూరగాయలు.

అప్పయ్యమ్మ కూరగాయలు అమ్మే తల్లి మాత్రమే కాదు - ఒక త్యాగ రూపిణి, జీవితంలో ఎన్ని కష్టాలు వచ్చినా ఎదుర్కొనే ధైర్యవంతురాలు.

**ఆమె రోజు ఇలా మొదలవుతుంది:** 10 కిలోమీటర్లు కాలిబాట నడక. ఊరివీధుల్లో "వంకాయలు తెచ్చానమ్మ!!!, బెండకాయ చవకగా ఉంది..." అనే శబ్దం వినిపిస్తూనే ఉంటుంది.



కానీ ఆమె హృదయంలో మాత్రం ఒకే మాట తిరుగుతూ ఉంటుంది. "నా కొడుకు చదవాలి... మా పరిస్థితులు మారాలి."

ఒకరోజు, భారీ వర్షం హోరుగాలి... వరద నీరు బురదై రంగు మారి పారుతుంది. స్పృహతప్పి పడిపోయింది, తట్టలో కూరగాయలు చెల్లాచెదురుగా పడి వరదలో కొట్టుకుపోతున్నాయి. జబ్బు ఎక్కువై కీళ్ల నొప్పితో కదలలేని స్థితిలో ఉన్న అప్పయ్యమ్మని గ్రామస్థులు ఆసుపత్రికి తీసుకెళ్లారు.

అక్కడ డాక్టర్ ప్రశ్నించాడు. "నిద్ర, విశ్రాంతి అవసరం..."

అది విని ఆమె అన్నది. "ఇసరాంతి నాకు అపుడే రాదు డాకటేరు బావూ... నా కొడుకు పరీక్ష పాసైన రోజు... అపుడే నాకు ఇసరాంతి."

వెంకటి ఆరోజు తన తల్లిని చూసి కన్నీరు పెట్టుకున్నాడు. "నువ్వు ఎదిగే రోజునే నేను విశ్రాంతి తీసుకుంటాను బాబు" – ఆ మాటలు అతని మెదడులో పదే పదే తిరిగేవి.

ఇంట్లో విద్యుత్ లేక పోయినా అప్పటి నుంచి రాత్రి 10 దాటినా, తలకింద తల్లి చెయ్యి పక్కన కిరోసిన్ దీపం వెలుగులో పుస్తకాలు మూసేవాడేకాదు.

వెంకటి చదివిన విధానం మామూలుగా ఉండేది కాదు స్కూల్ కి వచ్చే సరికి సీనియర్లు వదిలిపెట్టిన పాత పుస్తకాలు, ఇంటర్ నెట్ లేకపోయినా నిఘంటువులు, పాత ప్రశ్నాపత్రాలు, స్కూల్ లైబ్రరీలో ఉన్న పుస్తకాలు అన్నీ అతడి ఆయుధాలయ్యాయి. పాత పేపర్లలో అడిగిన ప్రశ్నలపై ఉత్తరాలు రాసేవాడు. మొబైల్ లేకపోయినా, పాతపుస్తకాలతోనే పరీక్షలకు సిద్ధం అయ్యాడు.

**ఫలితాలరోజు:** 2003 ఏప్రిల్. స్కూల్లో హర్షధ్వానాలు. ఫలితాలు బోర్డు మీద కనిపించాయి. వెంకటి – GPA: 10/10

**జిల్లాలోటాప్:** ప్రిన్సిపాల్ వేదిక మీదకి పిలిచారు. కానీ వెంకటి ముందుగా వెళ్లింది తన తల్లి వద్దకి.

మట్టి అంటుకుని తడిగా ఉన్న ఆమె పాదాల దగ్గర వంగి పోయి తన మార్కుల జాబితా పెట్టాడు. వెంకటి కళ్ళల్లో ఆనంద భాష్పాలతో "అమ్మా.. నువ్వు నడిచిన ప్రతీ అడుగుకి ఇది నేనిచ్చే బహుమతి."

నువ్వు నాకోసం ప్రతీరోజు నిద్రమాని గంటలు తరబడి చదివించిన ప్రతీ క్షణం గుర్తుందమ్మా తిరిగి నీమొహంలో చిరునవ్వు కోసం వేచి చూసాను అంటూనే "నువ్వు చూడు అమ్మా – ఈ విజయం నీదే" అన్నాడు.

"ఇప్పుడైనా విశ్రాంతి తీసుకోమ్మా..." అన్న వెంకటి మాటకు తల్లి మౌనంగా అతడి తల మీద చేయి వేసింది. చిరునవ్వు కురిసింది.

అది ఓ ఆశీర్వాదం కాదు – అమ్మ నమ్మకం.

– గౌరీ శంకరరావు గొంగాడ
M.Sc Psychology (Andhra University)
Career Guidance & Mental Health Counsellor
SSA-Edcil.





## పుస్తక పఠనం

పంట చేల సోయగాలు రైతన్న కష్టఫలాలు
పొలాలలో నీరు కట్టి కదులుతున్న హలాలు
పక్షుల కిలకిలారావాలు పెనక మీద పాటలు
అలసత్వం వీడిన కర్షకునికి వేకువ వినిపించు సరాగాలు

పుస్తకములు చదివిన మన కనుల విరియు హరివిల్లు ॥

సెలయేటి గలగలలు,
ఎత్తైన పర్వత శిఖరాలు, లోయలు..
అగ్నిపర్వతపు కీలలు, లోతైన సంద్రాలు, తీరాలు..
సువిశాల మైదానాలు, ఎడారులు..

పుస్తకములు చెబుతాయి నీకు వాటి ఎత్తు పల్లాలు..॥

ఆట – పాటలే కాదు గెలుపు – ఓటములుంటాయి..
సుఖ – సంతోషపు పూబాటలే కాదు దుఃఖ –బాధలుంటాయి
ఈ ప్రపంచాన అంతులేని అందాలతో పాటు
అణుబాంబులు కూడా ఉంటాయని


తెలుపగలిగేది పుస్తకమే.. ॥

పుస్తక పఠనంతో జగతిన మెరిసిన దివ్వెలు..
టీచర్లు, డాక్టర్లు, కలెక్టర్లు, లాయర్లు,
సిపాయిలు, సైంటిస్టులు ఎవరైనా..
తిరిగి నిన్ను కలుస్తారు.. పుస్తక పఠనం లోనే.. ॥

ఓ మనిషి పుస్తక పఠనం చేసి ప్రపంచాన్ని చదువుకో...
రహదారిలో నడిచి నువ్వు పూలబాట వేసుకో..


రచన: **పి మాలతి**, స్కూల్ అసిస్టెంట్ హిందీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తామాడ గ్రామం, లావేరు మండలం, శ్రీకాకుళం జిల్లా,
9493576537

## చుక్కలు కలపండి



## రంగులు వేయండి





## చెట్టు



చెట్టు లేనిదే మనిషి మనుగడ సాగదు
చెట్టు తన ఆయుధమనే ఆయువును
మనిషికి ధారవోసెడి త్యాగమూర్తి
చెట్టు వుంటేనే – చదువు వున్నది
కరెన్సీ కాగితాన్ని కానుకగ ఇచ్చేది చెట్టు
తనకు నివాసం వున్న లేకున్న
ప్రపంచ జీవరాసులకు నివాసాన్ని ఇచ్చేది తరువు
కళ్ళల్లో కదిలింది చెట్టు రూపం – మది నిండా నిండింది పచ్చదనం
జీవితం జగతి కొరకు – పెరుగుతుంది ప్రగతి కొరకు
సకల జీవులకు ప్రాణవాయువునిచ్చి–
సకల జనులకు ప్రాణదాతయైనదీ చెట్టు.

– **చోడగిరి స్పందన**, సీనియర్ ఇంటర్ యమ్. పి.సి,
ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల,
అగ్రహారం, ఏలూరు, 9676186340

## నిజాయితీ ఎల్లప్పుడూ ఉత్తమ విధానం


ప్రహికి డబ్బుతో నిండిన వాలెట్ దొరికినది. వాలెట్‌ని తను ఉంచు కోడానికి బదులుగా, ప్రహి వాలెట్‌ను దాని నిజమైన యజమానికి తిరిగి ఇచ్చాడు. దాని యజమాని ప్రహి ని ఎంతో మేచ్చుకొని, విషయం బడి ప్రధానోపాధ్యాయులకు చెప్పాడు. ప్రధానోపాధ్యాయులు, ఈ విషయం స్కూల్ ప్రేయర్ నందు ప్రకటించి చాలా. మెచ్చుకోన్నరు. దీనివల్ల ప్రహికి, బాలల దినోత్సవం రోజు మంచి బహుమతి లభించింది. నిజాయితీ ఎల్లప్పుడూ ఉత్తమ విధానం (Honesty is always the best policy).

– వి. వి. గిరి, అనంతపురం

## రెండు బొమ్మల్లో తేడాలను గమనించి వాటిపై సున్నా చుట్టండి.





## జతపరచండి




### 3 కథలల్లుదామా!


ఎవరైనా విద్యార్థిని ఒక చిన్న వాక్యంతో కథను మొదలు పెట్టమనండి. ఆ తరువాత మిగతా విద్యార్థులను ఆ వాక్యానికి అనుగుణంగా మరికొన్ని వాక్యాలు జోడించాలి. మరొక విద్యార్థి మరికొన్ని వాక్యాలు జోడించాలి. ఇలా ఒక అర్థవంతమైన గమ్మత్తైన కథను అల్లాలి. ఇలా అల్లిన కథకు ఏదైనా ఒక పేరు పెట్టమనాలి. మరియు దానికి సంబంధించిన కొన్ని చిత్రాలను కూడా గీయమనాలి. అదే కథను తమ నోటు పుస్తకంలో రాయమనాలి.



# బొమ్మను చూసి కథ రాసేద్దాం

హాయ్ ఫ్రెండ్స్.. ఇక్కడ కొన్ని కథా చిత్రాలు ఉన్నాయి. వాటిని చూసి కథ అల్లుదామా...
కథతో పాటు మీ ఫొటో, చిరునామా పంపండి. బాగున్న వాటిని ప్రచురిస్తాం.

Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
Whatsapp : 8712652298, mail: manabadimagazine@gmail.com



# బొమ్మ గీశానోచ్!

(రాజమహేంద్రవరంలో ఎస్.కె.వి.టి. ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ బొమ్మలు గీశారు నేస్తాలు. మీరు కూడా మీ ఊహలకు పదును పెట్టి బొమ్మ గీసి పంపండి. బాగున్నవాటిని ప్రచురిస్తాం.రచనలు పంపించాల్సిన మెయిల్ manabadimagazine@gmail.com వాట్సాప్ నంబర్: 87126 52298 )




**ఎల్.మహేష్,** 7వ తరగతి,
ఎస్.కె.వి.టి. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాజమహేంద్రవరం



**ఎం.చరణ్,** 8వ తరగతి,
ఎస్.కె.వి.టి. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాజమహేంద్రవరం




**గజాలా,** 8వ తరగతి,
ఎస్.కె.వి.టి. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాజమహేంద్రవరం








**M.అక్షర,** 8వ తరగతి
శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాల, తిరుమల

# ముళ్ళూ, పూలూ

ఆ మురుగునీటి గుంట పక్కనే ఉన్న ఇంటి పెరట్లో గోడకు చేర్చి పెంచిన రకరకాల మొక్కలకు పూలు విరగబూశాయి. ఆ రొచ్చునీటిలోనే ఆ పూలు ఆ ప్రతిబింబిస్తున్నాయి. డ్రైన్ సదుపాయం లేకపోవడంతో ఆ వీధిలోని ఇళ్ల నుంచి వచ్చే మురుగంతా ఖాళీగా ఉన్న పల్లపు స్థలంలోకి చేరి మడుగులా మారింది. వాహనాల రాకపోకలు అంతగా లేని వీధి అది. ఆ రోజు సెలవు కావడంతో కొందరు పిల్లలు రోడ్డు మీదే క్రికెట్ ఆడుతున్నారు. వాళ్లంతా పదేళ్ల లోపు వాళ్ళే.

బ్యాటింగ్, ఫీల్డింగ్ చేసే వాళ్ళు 'కేచ్, రన్ ఫాస్ట్, కమాన్ కమాన్, ఫోర్, అవుట్' వంటి అరుపులు అరుస్తూ చేసే సందడి.. రోడ్డుకూ, గాలికీ కూడా హుషారు వచ్చేలా ఉంది. ఆ పిల్లల వయసు కుర్రాడే ఒకడు భుజాన పెద్ద గోతంతో ఆ మురుగుగుంట పక్కనే ఉన్న చెత్తలో ప్లాస్టిక్ సీసాల వంటివి ఏరుకోవడానికి వచ్చాడు. పిల్లల ఆటతో వాడి చూపులు చెత్త కుప్పను వెతకడం మాని, బంతికీ, బాట్ కీ, పిల్లల పరుగుకూ, గెంతులకూ అతుక్కు పోయాయి. వాడి కాళ్లకు చెప్పుల్లేవు. వాడి వంటి మీది బట్టలు వాడి కొలతలకు తగ్గట్టు లేవు. వాడి ముఖం మట్టి గొట్టుకుని ఉంది. కానీ వాడు మనసు ఊహల్లోనే వాడి కాళ్లకు స్పోర్ట్స్ షూస్, వంటికి స్పోర్ట్స్ డ్రెస్, చేతికి గ్లోవ్స్ తొడిగి, వాడిని ఆ పిల్లల్లో ఒకడిగా కలిపేస్తోంది. వాడు ఆ చెత్త కుప్ప మధ్యనే నిలుచుని ఉన్నా.. ఊహల్లో ఆ పిల్లలతో కలిసి క్రికెట్ ఆడుతున్నాడు. బంతి వెంట పరుగులు తీస్తున్నాడు. 'కేచ్, ఫాస్ట్' అంటూ అరుస్తున్నాడు.

బ్యాటింగ్ చేస్తున్న పిల్లవాడు లాగి పెట్టి కొట్టడంతో ఎర్రటి ఆ బంతి గాల్లోకి ఎగిరింది. బ్యాటింగ్ చేస్తున్న కుర్రాళ్ళు 'సిక్స్' అంటూ కేరింతలు కొట్టారు. ఫీల్డింగ్ కుర్రాళ్ళు తలలు పైకెత్తి, చూపులు బంతి మీదే పెట్టి, అది దూసుకుపోతున్నవైపు పరుగు తీశారు. బంతి పోయి చెత్తకుప్ప పక్కనే పెరిగిన తుప్పల్లో పడింది. పిల్లలు అయిదు నిమిషాల పాటు ఎంత వెతికినా బంతి కనబడలేదు. వాళ్ళలా వెతుకుతుండగా చెత్త ఏరుకునే పిల్లవాడు తనకు పనికివచ్చే ప్లాస్టిక్ సీసాలు, సంచులూ ఏరి, గోతంలో వేసుకోసాగాడు.



బంతిని వెతుకుతున్న పిల్లల్లో ఒకడి మనసుకు ముల్లు లాంటి అనుమానం వచ్చింది. పక్కనున్న వాడితో "రేయ్ బబ్లూ.. బాల్ ఈ చెత్త ఏరే వాడికి దొరికితే ఆ సంచిలో వేసుకుని ఉంటాడ్రా!" అన్నాడు. బబ్లూ ఆ అనుమానాన్నే నూటికి నూరుపాళ్లు నిజమని నమ్మి, చెత్త ఏరుకునే పిల్లవాడి దగ్గరికి వెళ్లి "రేయ్.. సంచిలోంచి బాల్ తియ్యరా బయటికి!" అని గద్దించాడు. దూసుకొచ్చిన ఆ బాల్ నేరుగా తన ముఖానికే తగిలినట్టు అనిపించింది చెత్త ఏరుకునే పిల్లవాడికి. నల్లని మట్టి చారలు కట్టిన ముఖం అవమానంతో ఎర్రబారగా "నేనేం తియ్యలేదు బంతి. ఆ తుప్పల్లోనే పడింది. వెతుక్కోండి!" రోషంగా అన్నాడు.

"వీడు అబద్ధాలాడుతున్నాడ్రా! ఆ సంచిలో దాచేసి ఉంటాడు అంటూ బబ్లూ వాడి భుజం మీదున్న సంచిని లాగబోయాడు. తనకు తిండిపెట్టే సీసాలూ, ఇతర వ్యర్థాలూ ఉన్న ఆ సంచిని ఆ పిల్లవాడు గట్టిగా పట్టుకుని ఉన్నాడేమో- బబ్లూ లాగగానే సంచితో పాటు తూలి కింద పడ్డాడు. వాడి కుడికాలి మడమ గాజుపెంకు మీద పడడంతో కసుక్కున దిగబడింది. వాడి కాళ్ళు చెప్పుల్లేక కాయబారినవే అయినా పెంకు పదునైనదీ, బరువైనదీ కావడంతో నెత్తురు చింది వాడి మడమే.. కనబడకుండా పోయిన ఎర్రటి క్రికెట్ బాల్ లా కనిపించింది. అంత నెత్తురు చూడగానే ఆ పిల్లవాడు కళ్ళు తిరిగి దబ్బున కిందపడిపోయాడు. అది చూడగానే పిల్లలంతా బిత్తర పోయారు. కొందరి కళ్ళలో బెదురు. బబ్లూ అయితే ఫుల్ టాస్ బంతిని లాగి పెట్టి కొట్టినట్టు పరుగులంకించుకున్నాడు. అంతే రివ్వున క్షణాల్లో తిరిగి వచ్చిన వాడి చేతుల్లో వాళ్ళింట్లో ఉండే ఫస్ట్ ఎయిడ్ కిట్!

– **యు. సూర్యచంద్రరావు** *(వి-రాగి)*
కొంతమూరు – *533 102*,
రాజమండ్రి రూరల్, తూ.గో. జిల్లా, *99593 65373*

## మీకు తెలుసా?

1. కథాకళి శాస్త్రీయ నృత్యం ఏ రాష్ట్రానికి చెందినది? *కేరళ*
2. 2024లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర పండుగ? *రథసప్తమి*
3. 2023లో G 20 సదస్సుకు ఆతిథ్యం ఇచ్చిన నగరం? *న్యూఢిల్లీ*
4. భారతదేశ రాష్ట్రపతిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వ్యక్తి? *నీలం సంజీవరెడ్డి*
5. ఇండియన్ నెపోలియన్ బిరుదు ఎవరికి కలదు? *సముద్రగుప్తుడు*
6. పంచనదుల ప్రాంతం అని దేనిని పిలుస్తారు? *పంజాబ్*
7. జాతీయ వారసత్వ జంతువు? *ఏనుగు*
8. 2024 లో 'మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న' అవార్డు పొందిన చెస్ క్రీడాకారుడు? *దొమ్మరాజు గుకేష్*
9. ప్రస్తుతం రిజర్వ్ బ్యాంక్ గవర్నర్? *సంజయ్ మల్హోత్రా*

నిర్వహణ: ***ధవళ తారా శంకర ప్రసాద్,***
M.A, M.ed, PGDES:BLisc,

## బ్యాగ్ లెస్ డే

పుస్తకాల బ్యాగులు మోసీ మోసీ
రోజూపాఠాలు వినీవినీ
అలసిసొలసే విద్యార్థులకు
శనివారం ఆటవిడుపే 'నో బ్యాగ్ డే'

ప్రభుత్వం ప్రవేశపెట్టే ''బ్యాగ్ లెస్ డే'లు
ఆటపాటలు, సృజనాత్మకతలు
వృత్తివిద్యలు, క్విజ్ లతో
పిల్లలను అలరించే విశేష దినాలు



పుస్తకాల భారం లేని దినం
బాలలకు శ్రమలేని బడి పయనం
పుస్తకాలు లేని బోధనం
వైవిధ్యభరితమైన అభ్యసనం

వారం వారం అమలుచేసే ఈ ప్రక్రియలు
వినూత్న కార్యాచరణ ప్రణాళికలు
చిన్నారుల్లో ఆందోళనలు తగ్గించే చర్యలు
బడిపట్ల ఆసక్తిని పెంచే ప్రోత్సాహకాలు

పని ఆధారిత ప్రత్యేక అభ్యసనాలు
బాలల జీవిత నైపుణ్యాలకు పునాదులు
అందుకే ఈ సరికొత్త విధానం
ప్రతి బడిలో వాంఛనీయం..!

– **పి.వి.ప్రసాద్,** 74-7-2/2,
*పటమట, విజయవాడ. 9440176824*




## అంకెల పాట

అంకెలనే చెప్పేద్దాం.. ఆనందాన్ని పంచేద్దాం..

1. ఒకటంటూ చెప్పేద్దాం.. భూమి మనకు ఒకటందాం...
   మనసులమంతా ఒకటవుదాం...
2. రెండంటూ చెప్పేద్దాం.. రాత్రి పగలు రెండందాం...
   రెట్టింపై ఉరికేద్దాం...
3. మూడంటూ చెప్పేద్దాం... కాలాలేమో మూడందాం...
   ముచ్చట గానూ మురిపిద్దాం...
4. నాలుగంటూ చెప్పేద్దాం... దిక్కులు మనకు నాలుగందాం..
   నవ్వుతు మనము నడిచేద్దాం...
5. ఐదంటూ చెప్పేద్దాం.. జ్ఞానేంద్రియాలు ఐదందాం...
   అందరితో కలిసుందాం...
6. ఆరంటూ చెప్పేద్దాం... ఋతువులు మనకు ఆరందాం...
   ఆడుతు పాడుతు జీవిద్దాం...
7. ఏడంటూ చెప్పేద్దాం... ఖండాలేమో ఏడందాం...
   ఎంచక్కా మనం చదివేద్దాం...
8. ఎనిమిదంటూ చెప్పేద్దాం... గ్రహాలు మనకు
   ఎనిమిదందాం.... ఏదైనా నేర్చేద్దాం...
9. తొమ్మిదంటూ చెప్పేద్దాం... ధాన్యాలన్నీ తొమ్మిదందాం....
   తోడునీడగా జీవిద్దాం...
10. పది అంటూ పలికేద్దాం... విష్ణవతారాలే పది అందాం...
    పాటలు ఎన్నో పాడేద్దాం....

– **కోవెలకొండ సంతోష్ కుమార్ స్వామి** తెలుగు పండిట్
*మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల చిదిమి, వీరఘట్టం*
*మండలం, పార్వతీపురం మన్యం జిల్లా.*
9618390629

समग्र शिक्षा
Samagra Shiksha
సమగ్ర శిక్షా

## Scan the QR Code & Follow Samagra Shiksha

**Samagra Shiksha Official (AP)**

Official entity of Department of School Education, Govt. of Andhra Pradesh

- Samagra's Official WhatsApp Channel
- Samagra's Official YouTube Channel
- Samagra's Official Instagram Page
- Samagra's Official Facebook Page
- Samagra's Official X (Twitter)
- Samagra's Official LinkedIn Page

One stop for official Announcements & Initiatives from Andhra's Education Department

Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed by : **M/s. Lakshmi Vignesh Printers,** Guntur